

# అసలు తగ్గేదేలే..!

**పెనుగుదురు సర్పంచ్ పీఠం నీదా.. నాదా..!**
**ఓటర్లను ప్రసన్నం చేసుకునే పనిలో ఇరువురు ఆశావహులు**
**లక్షల్లో ఖర్చు... హోరెత్తిస్తున్న ప్రచారం**
**గ్రామంలో అప్పుడే మొదలైన స్థానిక సమరం**

**కరప, పెన్ పవర్,ఆగస్టు 21:** ఇంకా రిజర్వేషన్లు ఖరారు కాలేదు.. స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ రానే లేదు. అయినప్పటికీ సర్పంచ్ పీఠం దక్కించుకోవాలనే కసితో కొన్ని నెలలుగా ఇరువురు ఆశావహులు తీవ్ర స్థాయిలో ప్రయత్నిస్తున్నారు. ఈ క్రమంలో ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అందివచ్చే ఏ అవకాశాన్ని వారు వదులుకోవడం లేదు. గ్రామంలో ఎడాపెడా సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే తమ ఇంట జరిగే వేడుకలకు, పుట్టినరోజు, గృహప్రవేశ తంతులకు గ్రామస్తులను పిలిచి పండగలా జరుపుకుంటున్నారు. గ్రామంలో పోటాపోటీగా కార్యక్రమాలను చేపడుతూ లక్షలాది రూపాయలను తృణప్రాయంగా ఖర్చు పెడుతున్నారు. ఇప్పుడే ఈ స్థాయిలో ఖర్చుపెడుతుంటే ఎన్నికలొస్తే ఇంకెంత ఖర్చు చేస్తారోననే ఉత్సుకత గ్రామస్థుల్లో రోజూరోజుకీ పెరిగిపోతోంది. అవసరమైతే కోట్లయినా ఖర్చుపెడతాం కానీ.. తగ్గేదే లేదని ఇరువురి ఆశావహులు తమ అనుచరుల వద్ద చెబుతున్నారంటే సర్పంచ్ పీఠం కోసం వారు ఏ స్థాయికి సిద్ధపడుతున్నారో అర్థం చేసుకోవచ్చు. గతంలో ఇక్కడ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవం కావడంతో ఉస్సురుమన్న గ్రామస్థులు ఇప్పుడు జరుగుతున్న రాజకీయ పరిణామాలతో సంబరపడిపోతున్నారు. జనసేనపార్టీకి చెందిన ఇరువురు ఆశావహులు రాబోయే స్థానిక సమరంలో ప్రత్యర్థులుగా బరిలోకి దిగుతామని బహిరంగంగా ప్రకటించడంతో ఎంచెయ్యాలో తెలియక అధికారపార్టీ నేతలు తలలు పట్టుకుంటున్నారు.

ఓట్ల వేటలో కొత్త ఎత్తుగడలు : పెనుగుదురు సర్పంచ్ బరిలో నిలిచిన ఇద్దరూ రాజకీయ నేపథ్యం ఉన్నవారే. ఆక్వా, రియల్ ఎస్టేట్ వ్యాపారాలతో ఆర్థికంగా స్థిరపడినవారే. దీంతో గ్రామంలో రాజకీయం మరింత వేడెక్కింది. ఓటర్లను తమవైపుకు లాక్కునేందుకు రకరకాల తాయిలాలతో ముందుకు వస్తున్నారు. పనిలో పనిగా ఓట్ల వేటలో కొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్నవారు, బంధువుల ఓట్లను గ్రామానికి బదిలీ చేయించేందుకు అలుపు లేకుండా కృషి చేస్తున్నారు. ఆధార్ కార్డులో వారి వివరాలను మార్పు చేస్తున్నారు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి ఇక్కడకు ముకాం మార్చినవారిని, ఇక్కడే ఇల్లు కట్టుకుని నివాసం ఉంటున్నవారి ఓట్లను ఓటర్ల జాబితాలో చేర్చే పనిలో పడ్డారు . విశ్వసనీయ సమాచారం మేరకు ఇరు వర్గాలు ఇప్పటి వరకూ సుమారు 400 కొత్త ఓట్లను నమోదు చేసినట్టు తెలుస్తోంది.

సేవాకార్యక్రమాలతో సందడి : గ్రామప్రజలకు చేరువయ్యేందుకు ఇరువురు ఆశావహులు పోటాపోటీగా రకరకాల సేవాకార్యక్రమాలు చేపడుతున్నారు. లక్షల వ్యయంతో ఉచిత వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయడమే కాక ఉచితంగా వేలాది వాటర్ కేన్లు పంపిణీచేశారు. వీధికో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని ఒక వర్గం ప్రకటిస్తుండగా మరో వర్గం అంతకుమించిన హామీలు గుప్పిస్తూ ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు, పుట్టినరోజు వేడుకల్లో మందు , బిర్యానీ ప్యాకెట్లు పంపిణీచేస్తూ తమకు మద్ధతుగా నిలవాలని కోరుతున్నారు. రోజూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తూ మద్యాన్ని పంపిణీ చేస్తున్నారు. ఇరువర్గాలు పలు సేవాకార్యక్రమాలు చేస్తూ తమ రాజకీయ భవిష్యత్ కోసం అంచనాలు వేసుకుంటున్నాయి. గ్రామంలో స్కూళ్లు, దేవాలయాలకు దానం చేసిన స్థలాలను తమ పూర్వీకులు ఇచ్చారని ఎవరికి వారు ప్రచారం చేసుకుంటున్నారు. గ్రామాభివృద్ధికి తామే కారణమంటూ పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నాలు జోరుగా సాగిస్తున్నారు.

ఇబ్బడి ముబ్బడిగా ఫ్లెక్సీల ఏర్పాటు : ఇద్దరు ఆశావహుల మధ్య పోటీకి ఫ్లెక్సీలు కూడా వేదికగా మారాయి. గ్రామ ప్రధాన వీధుల్లో ఇరువర్గాలకు చెందిన ఫ్లెక్సీలు ఎక్కడికక్కడ దర్శనమిస్తున్నాయి. ఒకరిని మించి మరొకరు తమ ఉనికిని చాటుకునేందుకు ప్రయత్నిస్తుండటంతో గ్రామంలో ఎక్కడ చూసినా రాజకీయ రచ్చ, సందడి కనిపిస్తోంది.

అసలు ట్విస్ట్..రిజర్వేషన్ : సర్పంచ్ పదవికి రిజర్వేషన్ ఏ వర్గానికి ఖరారవుతుందో తెలియకుండానే ఇద్దరు ఆశావహులు ఎన్నికల బరిలో నిలిచారు. లక్షలాది రూపాయలుఖర్చు చేస్తూ గ్రామ రాజకీయాన్ని వేడెక్కిస్తున్నారు. రిజర్వేషన్ తమకు అనుకూలంగా వస్తే ప్రస్తుత పోటీకి అర్థముంటుంది. లేకపోతే ఇంత హంగామాతో చేసిన ఖర్చు, ప్రచారం బూడిదలో పోసిన పన్నీరవుతుంది. వారి ప్రయత్నాలు ఫలించి రిజర్వేషన్ వారికి అనుకూలంగా వస్తే సంకుల సమరానికి తెరలేచినట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల షెడ్యూల్, రిజర్వేషన్ల కోసం ఆశావహుల తో పాటు గ్రామస్థులు ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

## ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు



**మండపేట. పెన్ పవర్.ఆగస్టు 21 :**మండపేట: నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తెలిపారు. శుక్రవారం టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకి వివరించి వినతిపత్రాలను సమర్పించారు. ప్రతి వినతిని ఓపికగా విన్న ఎమ్మెల్యే, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులతో ఫోన్లో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యలను వినడం మాత్రమే కాకుండా, వాటి పరిష్కారం కోసం అధికార యంత్రాంగంతో సమన్వయం చేస్తూ ముందుకు సాగుతామని తెలిపారు.



## రైతుల సాగునీటి కోసం కాలువల ఆధునికరణ పనులు

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 21:**కోనసీమ జిల్లా ప్రాజెక్ట్ ఉపాధ్యక్షులు కరుటూరు నరసింహారావు ఆధ్వర్యంలో అమలాపురం కాలువగట్టు ఆధునికరణ పనులు కొనసాగుతున్నాయి. అన్నదాతల పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందించాలనే లక్ష్యంతో కాలువల్లో పేరుకుపోయిన చెత్త, పూడికను జేసీబీల సహాయంతో తొలగించి శుభ్రపరిచే పనులు చేపట్టారు.కాలువల్లో అడ్డంకులు తొలగించడం ద్వారా నీటి ప్రవాహం మెరుగుపడి ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు సాగునీరు సులభంగా చేరుతుందని అధికారులు తెలిపారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యల్లో భాగంగానే కాలువల శుభ్రత, ఆధునికరణ పనులు చేపడుతున్నట్లు కరుటూరు నరసింహారావు పేర్కొన్నారు.

కాలువగట్టు పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడికను తొలగిస్తూ కాలువలను వినియోగానికి అనుకూలంగా తీర్చిదిద్దుతున్నారు. రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. సాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కాలువల ఆధునికరణ పనులతో రైతులకు సాగునీటి సమస్యలు తగ్గడంతో పాటు పంటల సాగుకు మరింత ప్రయోజనం కలుగుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## డీఎస్సీపై మండలిలో చర్చకు రాకుండా లోకేష్ పారిపోయారు.

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు.



**మండపేట. పెన్ పవర్.ఆగస్టు 21 :**డీఎస్సీ నియామకాల్లో చోటుచేసుకున్న అక్రమాలు, స్పోర్ట్స్ కోటాలో 400 ఉద్యోగాల భర్తీపై మండలిలో చర్చకు సమాధానం చెప్పలేక విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సభ నుంచి పారిపోయారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు విమర్శించారు. విజయలక్ష్మి నగర్ లోని వైసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ డీఎస్సీ నియామకాల్లో మెరిట్‌ను ఏ ప్రాతిపదికన నిర్ణయించారో ప్రభుత్వం స్పష్టంగా చెప్పలేకపోతోందని ఆరోపించారు. అంతర్జాతీయ స్థాయిలో దేశానికి పేరు తీసుకొచ్చిన క్రీడాకారిణి పీవీ సింధుకు ఉద్యోగం కల్పించడం ఆమెకు దక్కిన గౌరవమని అన్నారు. అయితే డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద 400 ఉద్యోగాల భర్తీ విషయంలో మెరిట్‌ను ఏ విధంగా పరిగణనలోకి తీసుకున్నారో ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. రైతులకు వ్యవసాయానికి అవసరమైన సాగునీరు అందించలేక ఇప్పుడు పంట మార్పిడి చేయాలని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతుల పంటల బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించేదని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం రైతులను అన్ని విధాలుగా మోసం చేస్తోందని ఆరోపించారు. రైతులకు ఇవ్వాల్సిన రైతు భరోసాను సైతం సక్రమంగా అందించకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రైతులను మోసం చేస్తున్నారని తోట విమర్శించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగులకు ఉద్యోగ భృతి కల్పిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు వాటిని అమలు చేయకుండా మాట తప్పారన్నారు. హామీలు ఇచ్చి మోసం చేయడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని ఎద్దేవా చేశారు. బీసీల రిజర్వేషన్లు పెంచామని చెప్పడం కూడా మరో మోసమేనని అన్నారు. బీసీలకు వాస్తవంగా ఎంత ప్రయోజనం కలిగిందో ప్రభుత్వం స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, బీసీల విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలను మభ్యపెడుతోందని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో రాయవరం మండలం ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఆ పార్టీ నాయకులు పోతంశెట్టి ప్రసాద్, సూరంపూడి సత్యప్రసాద్, సిరిపురపు శ్రీనివాస్, గొలుగూరి సందీప్, పిల్లా వీరబాబు, చిర్ల జయరామ్ రెడ్డి, కోణాల చంద్రబోస్, వాసిరెడ్డి అర్జున్, నల్లమిల్లి రామచంద్రా రెడ్డి, పలివెల మధు, వీరెల్లి సత్యనారాయణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి మండిపల్లి





**కాకినాడ , పెన్ పవర్,ఆగస్టు 21:** అన్నవరం ఆర్టీసీ బస్టాండ్‌ను రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బస్టాండ్‌లో ప్రయాణికులతో మంత్రి మాట్లాడి వారికి అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించే 'స్త్రీ శక్తి' పథకం అమలుపై మహిళా ప్రయాణికుల అభిప్రాయాలను మంత్రి తెలుసుకున్నారు. పథకం అమలుపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలవుతోందని ప్రశంసించారు.అన్నవరం బస్టాండ్‌లో ప్రయాణికులకు అందుతున్న మౌలిక సదుపాయాలను పరిశీలించిన మంత్రి, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆర్టీసీ క్యాంటీన్‌ను సందర్శించి డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందితో కలిసి అల్పాహారం చేశారు. ఆర్టీసీ కార్మికులతో ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

